# ఈనెల 20న రామచంద్రపురంలో 47వ జాబ్ మేళా




**రామచంద్రపురం, పెన్ పవర్,ఆగస్టు 17:** నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలో భాగంగా ఈ నెల 20న రామచంద్రపురంలో 47వ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.
గురువారం ఉదయం 10 గంటల నుంచి కెవీఆర్ హాస్పిటల్ సమీపంలోని ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా జరుగుతుంది. 19 నుంచి 32 సంవత్సరాల వయస్సు కలిగిన టెన్త్, ఇంటర్,ఐటీఐ,డిప్లొమా,డిగ్రీ,బీటెక్ విద్యార్హతలు ఉన్న అభ్యర్థులు ఈ మేళాకు హాజరు కావచ్చు.శ్రీసిటీ, కడప, రేణిగుంట,మేనకూరు తదితర ప్రాంతాల్లో ఉద్యోగాల కోసం డిక్సన్, హోల్డిక్సన్,ప్రీమియర్ ఎనర్జీ,నియోలింక్ ఎఫెక్ట్స్, డైకిన్ తదితర సుమారు ఐదు కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొననున్నాయి.ఎంపికైన అభ్యర్థులకు విద్యార్హత, పోస్టును బట్టి నెలకు రూ.13 వేల నుంచి రూ.23 వేల వరకు వేతనం లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు.అర్హత కలిగిన అభ్యర్థులకు కంపెనీలను బట్టి పీఎఫ్,ఈఎస్ఐతో పాటు భోజనం,వసతి,రవాణా వంటి సదుపాయాలు కూడా అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం కోరారు. మరిన్ని వివరాల కోసం 7075704852, 7075904852 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# ప్రజల సంతృప్తే అధికారుల పనితీరుకు ప్రధాన కొలమానం






- పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 17:** ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రజల సంతృప్తే అధికారుల పనితీరుకు ప్రధాన కొలమానమని జిల్లా కలెక్టర్ ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా అధికారులతో కలిసి పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను కలెక్టర్ నిర్వహించారు.అర్జీల స్వీకరణకు ముందు గతంలో పీజీఆర్ఎస్ ద్వారా అందిన వినతులపై జిల్లా అధికారులు తీసుకున్న చర్యలను కలెక్టర్ సమీక్షించారు. పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ ద్వారా అందిన అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ప్రజలకు వచ్చే ఐవీఆర్ఎస్ కాల్స్ ప్రాధాన్యతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు ఐవీఆర్ఎస్ కాల్‌కు సరైన స్పందన ఇవ్వడం ద్వారా ప్రభుత్వ సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుందని తెలిపారు. ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీదారులతో మాట్లాడి నిర్ణీత గడువులోగా సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు.అర్జీలు రీఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్జీదారులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా, వారికి పూర్తి సంతృప్తి కలిగేలా పరిష్కారం చూపాలన్నారు. ఏదైనా కారణంగా ఫిర్యాదును పరిష్కరించడం సాధ్యం కాకపోతే, అందుకు గల కారణాలను లబ్ధిదారులకు అర్థమయ్యే విధంగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని సూచించారు.ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం చూపరాదని హెచ్చరించారు. ఎండార్స్‌మెంట్లు తప్పుగా నమోదు చేయడం వంటి అంశాలపై సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.మానవీయ కోణంలో ప్రతి సమస్యకు నిబంధనలకు లోబడి పరిష్కారం అందించాలని సూచించారు.పీజీఆర్ఎస్‌లో వచ్చే ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి,నిర్ణీత గడువులోగా నాణ్యమైన, సంతృప్తికరమైన పరిష్కారం అందించాలన్నారు.రాష్ట్రస్థాయి నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారించి,వెంటనే నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.పిఠాపురం పట్టణ పరిధిలోని జగ్గయ్య చెరువు నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు.కోర్టు కేసులకు సంబంధించి వకాలత్‌ను వెంటనే ఫైల్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.డ్వామా,డీపీఓ, పంచాయతీరాజ్ శాఖల్లో కొత్తగా నమోదైన కేసులకు కూడా వెంటనే వకాలత్‌లు సమర్పించాలని ఆదేశించారు.అనంతరం జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, డీడీఓ వాసుదేవరావు,బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు,స్వర్ణ గ్రామ--స్వర్ణ వార్డు నోడల్ అధికారి జె.వేణుగోపాల్ తదితరులు అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు.కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలి



నులుకుర్తి వెంకటేశ్వరరావు

**కాకినాడ రూరల్, పెన్ పవర్,ఆగస్టు 17:** ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు క్షేత్రస్థాయిలోని ప్రతి అర్హుడికీ సమర్థవంతంగా అందాలంటే ప్రజల భాగస్వామ్యం,మద్దతు ఎంతో అవసరమని మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలు కూడా అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు గ్రామంలో 'ఇంటింటికీ తెలుగుదేశం' ప్రచార కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. కాకినాడ రూరల్ ఇన్‌చార్జ్,మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావుతో కలిసి నాయకులు గ్రామంలోని ప్రతి ఇంటినీ సందర్శించారు. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల ద్వారా సామాన్య ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను తెలియజేయడంతో పాటు, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు మిరపల సూర్యప్రకాష్,మద్దూరి స్వామి, గ్రామ పార్టీ అధ్యక్షుడు జి.సతీష్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు మరివాడ ఆనందరావు, మండల కార్యదర్శి అయితిపూడి వీరబాబు,డి. సత్యనారాయణ, మండల బీసీ సెల్ అధ్యక్షుడు జామి సత్తిరాజు, మండల ఎస్సీ సెల్ కార్యదర్శి ఈరెళ్ల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.జనసేన గ్రామ కమిటీ అధ్యక్షుడు ముమ్మిడి బుజ్జి, నీటి సంఘం అధ్యక్షుడు సింగం బాబ్జి,గ్రామ ఆర్గనైజింగ్ సెక్రటరీ యు.శీను,కూటమి నాయకులు గొల్లపల్లి రాజా,పిల్లి వీరబాబు,పెండెం బాబ్జి,అరవ శివ, కొమిరిశెట్టి నరసింగరావు, ఎలగా లోవరాజు,కొండా వినాయక్,బొజ్జా సాంబశివరావు,పలివెల గాయత్రి, దొమ్మేటి వెంకటరమణ,సవరపు పెదపాపారావు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతుకు రక్షణ

- పంటల మార్పిడితో నీటి పొదుపు, పెట్టుబడి భారం తగ్గింపు
- రైతులకు అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 17:** వర్షాభావ పరిస్థితుల్లో వరి సాగుకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండే పంటలను సాగు చేసేలా రైతులను చైతన్యపరచాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.జాతీయ ఆహార భద్రత, పోషకాహార మిషన్ సూచనల మేరకు పంటల మార్పిడి విధానంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సోమవారం స్థానిక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, ఇతర వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ప్రత్యామ్నాయ పంటల సాగుకు సంబంధించిన కరపత్రాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల మార్పిడి విధానాన్ని అవలంబించాలన్నారు.ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం,వర్షాలు ఆలస్యం కావడం, జలాశయాల్లో నీటి నిల్వలు క్షీణించడం వంటి పరిస్థితుల నేపథ్యంలో అధిక నీటి అవసరం ఉన్న వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడం ఉత్తమమన్నారు.పీఎండీఎస్ (నిరంతర హరిత సాగు) విధానం ద్వారా ఏడాది పొడవునా భూమి పచ్చని పంటలతో కప్పబడి ఉండేలా ప్రణాళికాబద్ధంగా సాగు చేయాలని సూచించారు.దీనివల్ల నీటి వినియోగ సామర్థ్యం పెరగడంతో పాటు కలుపు మొక్కల సమస్య తగ్గి, రైతులకు ఏడాది పొడవునా ఆదాయం లభించే అవకాశం ఉంటుందన్నారు. ప్రత్తి, పండ్ల తోటల్లో మిశ్రమ పంటల సాగును ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు.వరి స్థానంలో పెసర,మినుము,కందులు, శనగ, అలసందలు, ఉలవలు వంటి పప్పుధాన్యాలను సాగు చేయాలని రైతులకు సూచించారు. వీటికి నీటి అవసరం తక్కువగా ఉండటంతో పాటు 60 నుంచి 90 రోజుల్లో కోతకు వస్తాయని తెలిపారు. పప్పుధాన్యాల సాగుతో నేలలో నత్రజని శాతం పెరిగి భూసారం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. చిరుధాన్యాలు, నూనెగింజల సాగు ద్వారా కూడా వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చన్నారు.
2026 ఖరీఫ్ సీజన్‌లో పంటల బీమా ద్వారా రైతులకు సాగు భద్రత కల్పించేందుకు బీమా ప్రీమియం, పరిహారం వివరాలను కలెక్టర్ వెల్లడించారు. వరి పంటకు ఎకరాకు రూ.760 ప్రీమియం చెల్లిస్తే పంట నష్టం సంభవించినప్పుడు గరిష్ఠంగా రూ.38,000 పరిహారం లభిస్తుందని తెలిపారు. ప్రత్తి పంటకు ఎకరాకు రూ.2,000 ప్రీమియం చెల్లించాల్సి ఉండగా, పంట నష్టం వాటిల్లితే గరిష్ఠంగా రూ.40,000 పరిహారం లభిస్తుందన్నారు.పంటల మార్పిడి ద్వారా నీటి పొదుపుతో పాటు విద్యుత్ వినియోగం తగ్గుతుందని, ఎరువులు, పురుగు మందుల ఖర్చు తగ్గి రైతులపై పెట్టుబడి భారం తగ్గుతుందని కలెక్టర్ తెలిపారు.నేల ఆరోగ్యం మెరుగుపడటం,పర్యావరణ పరిరక్షణ, రైతులకు స్థిరమైన మరియు నిరంతర ఆదాయం లభించడం వంటి అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు.
రైతులు వర్షాల కోసం ఎదురుచూడకుండా అందుబాటులో ఉన్న నీటి పరిమాణాన్ని బట్టి తక్కువ వ్యవధిలో పూర్తయ్యే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి నీటి బొట్టునూ పొదుపుగా వినియోగించు కోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా స్థాయి వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.






01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆదిత్య విద్యార్థి ప్రతిభ

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 17:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి ఎన్. సూర్య విశేష ప్రతిభ కనబరిచాడు. రాష్ట్ర రాజధాని అమరావతిలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) కంటింజెంట్ పరేడ్‌లో పాల్గొని కళాశాలకు గర్వకారణంగా నిలిచాడు.దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావానికి ప్రతీకగా నిలిచే ఈ పరేడ్‌లో సూర్య చురుకుగా పాల్గొనడం అభినందనీయమని ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవ,దేశ సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు.రాష్ట్రస్థాయి కార్యక్రమంలో పాల్గొని ఆదిత్య విద్యాసంస్థలకు మంచి పేరు తీసుకువచ్చిన ఎన్.సూర్యను ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వై.డి. రామారావు, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి,వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ,నోడల్ ఆఫీసర్ టి. తేజేశ్వరరావు,ప్రిన్సిపాళ్లు,వైస్ ప్రిన్సిపాళు ్ల, అధ్యాపకులు,ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ విభాగాల నిర్వాహకులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



